ఏయ్ బిడ్డా.. ఇది మా అడ్డా..!

● గేటుకు తాళం వేసుకుని సజ్జల కుటుంబీకుల వార్నింగ్



కడప, మే 23 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని సీకేదిన్నె మండలంలో ప్రభుత్వ మాజీ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబీకులు అటవీశాఖ భూములతో పాటు వాగులు, వంకలు, పేదల భూములు కలుపుకొని 63.73ఎకరాలు ఆక్రమించారు. తమ భూములతో పాటు ఆక్రమించిన భూముల్లో పండ్లతోటలు, వివధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆక్రమిత భూములను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాలతో రెవెన్యూ వాళ్లు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్టేట్‌లో ఉన్న ప్రభుత్వ భూముల్లోకి ఎవరైనా వెళ్లవచ్చు. అయితే గురువారం సీకేదిన్నె మండలం సుగాలితాండాకు చెందిన కొందరు ఎస్టేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా సజ్జల కుటుంబీకులు గేటుకు తాళం వేసి లోనికి రానివ్వకుండా అడ్డుకున్నారు. మీరెవరు మా భూముల్లోకి వచ్చేదంటూ వార్నింగ్ ఇచ్చారని తెలిసింది. సజ్జల ఎస్టేట్‌లో అన్యాక్రాంతమైన భూములను గుర్తించిన అధికారులు వాటికి హద్దులు గుర్తించి జెండాలు పాతి ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశారు. అది ప్రభుత్వ భూమి కావడంతో ఎవరైనా లోనికి వెళ్లవచ్చు. ఆ ఎస్టేట్‌లోకి వెళ్లేందుకు ఎస్టేట్‌కు ఉత్తరం, దక్షిణం అటవీ ప్రాంతం పడమరవైపు ఇడుపులపాయ ఉంది. ఈ మూడు వైపుల నుంచి రహదారి లేదు. తూర్పువైపు నుంచే ఎస్టేట్‌లోకి వెళ్లాల్సి ఉంది. అయితే అక్కడ గేటు నిర్మించారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన డీకేటీ భూములు కూడా ఇక్కడ ఉన్నాయి. వారు ఆ భూముల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా గేటుకు తాళం వేసి రాకుండా అడ్డుకున్నట్లు చెబుతున్నారు.

కడపలో కరోనా కలకలం?



కడప సెవెన్‌రోడ్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో శుక్రవారం ఉదయం ఒకరికి కరోనా సోకిందంటూ కాసేపు కలకలం రేగింది. రెండు రోజుల క్రితం చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు కరోనా లక్షణాలతో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేరింది. వృద్ధురాలిని పరీక్షించిన వైద్యులు అనుమానంతో కరోనా వార్డులో ఉంచి చికిత్స అందించారు. శుక్రవారం ఉదయం వరకు వైద్యులు సదరు మహిళకు కరోనా ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయం బయటకు పొక్కడంతో ఒక్కసారిగా వైరల్‌గా మారింది. శుక్రవారం డీఎంహెచ్‌ఓ బృందం సర్వజన ఆసుపత్రిలో పరిశీలించి వృద్ధురాలికి కరోనా లేదని నిర్ధారణ చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మహానాడులో అందరూ భాగస్వాములు కావాలి

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



టీఎన్ఎస్ఎఫ్ వలంటీర్లతో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి సంబంధించి అత్యంత వైభవంగా జరుపుకొనే మహానాడును విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు అందరూ భాగస్వామ్యం కావాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం ద్వారక నగర్‌లోని తమ నివాసంలో మహానాడు ఏర్పాట్లకు సంబంధించి వలంటీర్ల కమిటీలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఒక సైనికునిగా పనిచేయాలన్నారు. సభాప్రాంగణంలో అతిథులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వలంటీర్లు ప్రత్యేక భూమిక పోషించాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి విభాగం అతి కీలకమన్నారు. కడప జిల్లాలో తొలిసారిగా జరుగుతున్న ఈ మహానాడు పండుగను ప్రతి ఒక్కరు గుర్తుంచుకునేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, రెడ్డయ్యయాదవ్, వేణు, లోకేశ్‌తో పాటు టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంత రుచులు

● అనంతరాజుపేట పరిశోధన స్థానంలో 51 రకాల మామిడి కాయలు

వివరాలు..6లో

'మహా'జోరు

● మహానాడులో లోటుపాట్లకు తావివ్వద్దు
● అన్ని వసతులు ఏర్పాటు చేయాలి
● తొలి రెండురోజులు 25వేల మంది హాజరు
● భోజనం, పార్కింగ్ వసతులపై.. మహానాడు కమిటీ సుదీర్ఘంగా చర్చ



ముమ్మరంగా సాగుతున్న మహానాడు పనులు



మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీఎం కటౌట్

(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కనీవినీ ఎరుగ ని రీతిలో మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ నేతలు నిర్ణయించారు. మహానాడుకు గడువు దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారం మంత్రులు అనగాని సత్యప్రసాద్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధనరెడ్డి, గుండు సంధ్యారాణి జిల్లాకు చేరుకున్నారు. వీరితో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, జ్యోతుల నెహ్రూ, ఎన్.అమర్‌నాథరెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రవిచంద్రయాదవ్, ఆలపాటి రాజా, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కార్యనిర్వహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి తదితరులు మహానాడు ఏర్పాట్లను పరిశీలించారు.

గురు, శుక్రవారాల్లో వర్షాలు లేకపోవడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తొలి రెండురోజులు 27, 28తేదీల్లో నిర్వహించే ప్రతినిధుల సమావేశానికి 23వేల మంది హాజరు కానున్నారు. ఆ సమావేశ వేదిక పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇక చివరి రోజున ఐదులక్షల మందితో బహిరంగసభ నిర్వహించనున్నారు. ఆ వేదిక పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. చంద్రబాబు నాయుడు మూడురోజుల పాటు ఇక్కడే బస చేయనున్నారు. దీంతో సీఎం క్యాంపు కార్యాలయ వేదికను నిర్మిస్తున్నారు. భోజనశాల, ఎగ్జిబిషన్, రక్తదానశిబిరం పనులన్నీ 70 శాతానికి పైగా పూర్తయ్యాయి.

మహానాడు ఏర్పాట్ల నిర్వహణపై శుక్రవారం కడప ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో , మహానాడు వేదిక వద్ద వివిధ కమిటీలలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. మూడురోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి వసతి, భోజన సౌకర్యం, ట్రాఫిక్‌పై సుదీర్ఘంగా చర్చించారు. మహానాడుకు ఎంతమంది వస్తున్నారు, తొలి రెండురోజులు ఎంతమంది వస్తున్నారు.. స్థానికంగా వారికి వసతి, భోజనాలు ఏర్పాటు చేయడం, చివరి రోజు బహిరంగసభకు వచ్చే జనాలకు ఒకే చోట భోజనం పెట్టాలా లేక ప్యాకెట్ల ద్వారా ఇవ్వాలా అన్నదానిపై మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆధ్వర్యంలో చర్చ జరిగింది. తొలి రెండురోజులు 25వేల మంది హాజరవుతారని భావిస్తున్నారు. వీరందరికీ జిల్లావ్యాప్తంగా పలుప్రాంతాల్లో వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. రకరకాల వంటకాలు అందించాలని నిర్ణయించారు. బహిరంగసభకు వచ్చే జనాలకు ఆయా ప్రాంతాల్లో భోజనాలు ఏర్పాటు చేయాలా, లేక ప్యాకెట్ల రూపంలో ఇవ్వాలా అనే దానిపై చర్చ నిర్వహించారు. బహిరంగసభ రోజు వచ్చే వాహనాలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలంటే రింగురోడ్డులో అక్కడక్కడా డివైడరు తొలగించి తరువాత వాటిని నిర్మించాలని నిర్ణయించారు.

కడప పసుపుమయం

మహానాడు వేళ కడప నగరాన్ని పసుపుమయం చేయాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే రాజంపేట, కడప రహదారి, కడప-మైదుకూరు, కడప-కమలాపురం రింగురోడ్డు చుట్టూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇతర టీడీపీ నేతలతో ఉన్న ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. కడప నగరంలోని కూడళ్లన్నీ పసుపుమయం చేస్తున్నారు.

వైభవంగా నిర్వహిస్తాం

మహానాడును మూడురోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామని మంత్రి గుండు సంధ్యారాణి అన్నారు. పనులన్నీ త్వరితగతిన పూర్తవుతున్నాయన్నారు. ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ కడప జగన్ అడ్డా కాదు, ఇది జనం గడ్డ అన్నారు. జనం ఓట్లేస్తేనే మేం ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేది. అంతే తప్ప ఇది ఎవరి గడ్డ కాదన్నారు. కడపలో మహానాడు నిర్వహించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా

కడప రింగురోడ్డు 35 కిమీ ఉంది. చిత్తూరు-కడప-కర్నూలు జాతీయ రహదారి అలాగే కడప-రేణిగుంట-చెన్నై రహదారులు ఈ రింగు రోడ్డునుంచే వె ళ ం త ం ం టా ం ౖ ౖ. మహానాడును రాయచోటి రింగు రోడ్డు నుంచి పులివెందుల వైపు వెళ్లే రింగు రోడ్డు మీదుగా పడమర వైపు నిర్మిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవేళ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే కర్నూలు-చిత్తూరు-రేణిగుంట వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగసభకు 50వేలకు పైగా వాహనాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. దీంతో మహానాడు వేదిక సమీపంలోనే ఇటు పులివెందుల వైపు వెళ్లే రహదారి, అటు రాయచోటి వైపు వెళ్లే రహదారికి అనుకుని వేదిక వద్ద సుమారు 150 ఎకరాల్లో పార్కింగ్ స్థలం కేటాయించారు. అక్కడ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బహిరంగసభకు భారీ ఎత్తున జనం హాజరు కానుండడంతో నెట్‌వర్క్‌కు ఇబ్బంది లేకుండా ఎయిర్‌టెల్, జియో, బీఎస్ఎన్ఎల్ ఇతర కంపెనీలకు చెందిన నాలుగు మొబైల్ టవర్లను మైదానంలో ఏర్పాటు చేశారు. తొలి రెండురోజులు జరిగే ప్రతినిధుల సభకు 23వేల మందికి ఆహ్వానం పంపారు. అలాగే ఎమ్మెల్యేలు, వారి అనుచరులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని లాడ్జిలు, ఫంక్షన్‌హాల్స్, రిసార్ట్స్, ప్రభుత్వ అతిథిగృహాలు బుక్ చేశారు. కడప జిల్లాతో పాటు సమీపంలోని తిరుపతి, నంద్యాల, కర్నూలులో వసతి కోసం గదులు తీసుకున్నారు.







ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధనరెడ్డి, సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, జ్యోతుల నెహ్రూ, ఎన్.అమర్‌నాథరెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తదితరులు

మహానాడుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

కడప క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): మహానాడు సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ ఈజీ శోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులకు దిశ నిర్దేశనం చేశారు. మహానాడుకు పలువురు వీఐపీలు, వీవీఐపీలు, పెద్ద ఎత్తున ప్రజలు రానునన్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



పీఎఫ్ సమస్యలపై 27న అవగాహన సదస్సు

కడప కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27వ తేదీన కడపలోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈపీఎఫ్ఓ 'నిధి ఆప్కే నికట్ 2.0' అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పీఎఫ్ అసెస్టెంట్ రీజనల్ కమిషనర్ అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లాలో తలపెట్టిన అవగాహన సదస్సు పుట్లంపల్లిలోని శ్రీషిర్డీసాయి ఎలక్ట్రికల్స్ వారి ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పార్క్‌లో జరుగుతుందన్నారు. అలాగే కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, శీసత్య సాయి, నెల్లూరు జిల్లాల్లోని ఈపీఎఫ్ఓ, చందాదారులు, పింఛన్‌దారులు హాజరై తమ సమస్యలు నివృత్తి చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత

● ప్రభుత్వ నిబంధనలు పాటించాలి
● రైతు బజారు తనిఖీలో సీఈవో మాధవీలత

కడప రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని బిజివేముల వీరారెడ్డి రైతు బజారును శుక్రవారం ఏపీ రైతు బజారు సీఈవో మాధవీలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు బజారు ఆవరణలోని పరిసరాలను పరిశీలించారు. మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు బజారుకు ఏ యే ప్రాంతాల నుంచి కూరగాయలు వస్తున్నాయి, వాటి ధరలు, విక్రయాలపై ఆరాతీశారు. రైతు బజారులో ఎన్ని రూములు ఉన్నాయి వాటిని ఏ విధంగా రైతులకు, ఇతర వ్యాపారులకు కేటాయిస్తున్నారు అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సౌకర్యం, బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని ఆరా తీశారు. ధరల పట్టిక ప్రకారం విక్రయాలు చేపడుతున్నారా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం సీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పేట వేస్తోందన్నారు. అందులో భాగంగా రైతు బజారులు రైతుల ఉత్పత్తుల విక్రయాలకు అనుగుణంగా తగిన వసతులను కల్పిస్తున్నాయన్నారు. రైతు బజారుతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ ఆజాద్‌వలి తదితరులు పాల్గొన్నారు.



కడప రైతు బజారును తనిఖీ చేస్తున్న సీఈవో మాధవీలత



కష్టకాలంలో జెండా పట్టిన కార్యకర్తలకు

న్యాయం జరిగేనా..?



● పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదైనా పట్టించుకోని నాయకత్వం
● నామినేటెడ్ పదవుల్లో వైసీపీ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం
● ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు

వైసీపీ ఐదేళ్ల పాలనలో టీడీపీని దెబ్బ కొట్టడానికి జగన్ ఎన్ని విశ్వప్రయత్నాలు చేసినా పార్టీని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు బతికించుకుంటూ వచ్చారు. జగన్ అరాచక పాలనతో నేతలే భయపడి దాక్కునే పరిస్థితి వచ్చింది. కొందరు కార్యకర్తలు మాత్రం భయపడకుండా పార్టీని అధికారంలోకి తెచ్చుకునే వరకు జెండాను దించకుండా పనిచేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. కానీ నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను పట్టించుకునే వారు కరువయ్యారని అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి.

- ప్రొద్దుటూరు, ఆంధ్రజ్యోతి

పట్టణ, మండల కమిటీల ఎంపిక ఎప్పుడు

పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికాబోతుంది. ఇప్పటికీ పార్టీ పట్టణ కమిటీలు, మండల కమిటీలు, అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటుపై నియోజకవర్గ నాయకత్వంతో పాటు జిల్లా నాయకత్వం పట్టించుకోక పోవడంతో పార్టీ క్యాడర్ అసంతృప్తితో ఉన్నారు. ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చుకుంటే కనీసం పార్టీ పదవుల్లో కూడా తమకు న్యాయం జరగకపోతే ఎలా అని కొందరు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వం ఆవేదన చెందుతున్నారు. పార్టీలో ఎలాంటి హోదా లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో గానీ బయట గానీ తమకు ఎలాంటి గుర్తింపు లేదని వాపోతున్నారు.

నామినేటెడ్ పదవుల్లో న్యాయం ఏదీ

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పదవుల్లో హార్డ్ కోర్ టీడీపీ కార్యకర్తలకంటే ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత వైసీపీ లోనుంచి వచ్చిన వారికే కట్టబెట్టారనే అసంతృప్తి పార్టీ శ్రేణుల్లో ఉంది. అంతేకాకుండా పార్టీ ముఖ్యనేత అనుచరులుగా కొనసాగుతున్న వారు కూడా ఈ పదవుల కేటాయింపులపై అసమ్మతి వ్యక్తం చేసున్నారు. వైసీపీ హయాంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా ఉండి ఎన్నికల ముందు టీడీపీలోకి రాగానే అదే వ్యక్తికి మళ్లీ అదే పదవి వచ్చింది. దీంతో నిన్నటి వరకు టీడీపీ కోసం పనిచేసిన మైనారిటీ నాయకత్వంలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. అలాగే ఎన్నికల వేళ టీడీపీలోకి వచ్చిన వ్యక్తిని సహకార బ్యాంకుకు చైర్మన్‌గా చేయడంపై కూడా పెద్ద ఎత్తున అసమ్మతి వ్యక్తం అవుతోంది. జిల్లా ఆసుపత్రి కమిటీలో 2014లో టీడీపీ ప్రభుత్వంలో చైర్మన్‌గా ఉన్న వ్యక్తి అనంతరం వైసీపీకి వెళ్లాడు. తిరిగి గత ఏడాది ఎన్నికల ముందు టీడీపీలో చేరాడు. అతనికి తిరిగి అదే జిల్లా ఆసుపత్రిలో పదవి ఇచ్చారు. అంతేకాకుండా ఆ వ్యక్తి గత ఐదేళ్లలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉన్నాడు. నేడు టీడీపీలో ఎమ్మెల్యే, ఆయన కుమారుడి తరువాత అతనిదే హవా. అన్నింట్లో ఆయన నిర్ణయాలు సాగుతున్నాయి. అంతేకాకుండా ఆ ఆసుపత్రి కమిటీలో ఎన్నడూ టీడీపీ కోసం పనిచేయని వారికి స్థానం కల్పించారనే విమర్శలున్నాయి. అలాగే టీడీపీ గెలుపులో బీసీలు ప్రధాన పాత్ర పోషిస్తే పార్టీలో గానీ నామినేటెడ్ పదవుల్లో గాని వారికి ప్రాధాన్యత లేదని వాపోతున్నారు. రేషన్ దుకాణాల కేటాయింపుల్లో, బీసీ కార్పొరేషన్ రుణాల్లో గానీ, ఇతర ప్రభుత్వ శాఖల్లో, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో.. ఎక్కడా పార్టీ దిగువ శ్రేణి నాయకత్వం అభిప్రాయాలకు తావేలేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇది ఒక్క ప్రొద్దుటూరు నియోజకవర్గం మాత్రమే కాదు.. జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలు గెలిచిన అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. మహానాడు సందర్భంగా నైనా పార్టీ అధిష్టానం దృష్టి సారించి వైసీపీకి ఎదురొడ్డి టీడీపీని కాపాడుకున్న కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పార్టీలో సమన్వయలోపం..

టీడీపీలో రెండు మూడు గ్రూపులు ఉన్నప్పటికి ప్రొద్దుటూరులో గెలించిందంటే పటిష్టమైన చెక్కుచెదరని ఓటు బ్యాంకు ఉండటమే కారణం. పార్టీలో ఉన్న గ్రూపు నాయకత్వం మధ్య సమన్వయలోపం కొనసాగుతోంది. ఎమ్మెల్యే అనుచర వర్గంతోపాటు పార్టీతో మొదటి నుంచి ఉన్న ఇతర నాయకత్వంలోని క్యాడర్ కూడా ఉంది. వారంతా పార్టీ కోసం పనిచేసిన వారే. అలాంటి వారు పార్టీ అధికారంలోకి వస్తే తమకు ఎక్కడో ఒకచోట స్థానం దక్కుతుందని ఆశించారు. ఇప్పుడా ఆశలు సన్నగిల్లుతున్నాయని బహిరంగంగా వాపోతున్నారు. పార్టీలు మారకుండా టీడీపీతో దశాబ్దాలుగా ఉన్నవారి కంటే.. పార్టీలు మారినా ఒక వర్గం వారికే ప్రాధాన్యత ఉంటోందని విమర్శిస్తున్నారు.

అనంత రుచులు



ప్రస్తుతం పెద్ద భవనంలో కొనసాగుతున్న పరిశోధన కేంద్రం

- అనంతరాజుపేట పరిశోధన స్థానంలో 51 రకాల మామిడి కాయలు
- శాస్త్రవేత్తల పరిశోధనలతో నూతన వంగడాలు
- త్వరలో విడుదలకానున్న పలు రకాల మామిడి వంగడాలు
- 90 ఏళ్లుగా రైతు సేవలో పరిశోధన స్థానం

రైల్వేకోడూరు, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పరిశోధన స్థానంలో 51 రకాల మామిడి కాయలను పండిస్తున్నారు. ఇప్పటికే ఆరు రకాల కొత్త వంగడాలను విడుదల చేసి విజయవంతం చేశారు. త్వరలో పలు రకాల మామిడి కొత్త వంగడాలను విడుదల చేయనున్నారు. పరిశోధన స్థానం 90 ఏళ్లుగా రైతు సేవలో ఉంది.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో పండ్ల తోటలు అత్యధికంగా ఉన్నాయని బ్రిటీష్ దొరలు (మద్రాసు ప్రావిన్స్)లో గుర్తించి అనంతరాజుపేటలో 1935లో పరిశోధన స్థానం ఏర్పాటు చేశారు. పరిశోధన స్థానానికి మొట్టమొదటి సూపరిండెంట్‌గా కేసీ నాయక్ వ్యవహరించారు. 1960లో ఐకార్ ఆర్థిక సాయంతో అప్‌గ్రేడ్ అయింది. పరిశోధన స్థానం లక్ష్యం ఉష్ణ మండల పండ్ల తోటలు అభివృద్ధితో పాటు తెగుళ్లు, వ్యాధుల నియంత్రణ చేసి మెరుగుపచడంపై 1957-66 మధ్య పరిశోధనలు ప్రారంభించారు.

తొమ్మిది దశాబ్దాలుగా..

ఉష్ణమండల పండ్ల పంటలు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలపై పరిశోధనలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని మార్గదర్శక సంస్థలో ఈ కేంద్రం ఒకటిగా ఉంది. పండ్ల పంటలకు సాంకేతికలను అభివృద్ధి చేయడం, అధిక దిగుబడితో హైబ్రీడ్లను విడుదల చేయడం మామిడి ఇతర పంటలలో మంచి నాణ్యత గల పండ్లను రూపొందించడం లాంటి అనేక ఘనతలను సాధించింది. 90 సంవత్సరాలకు పైగా ఈ కేంద్రం స్థానం పండ్ల తోటల అవసరాలను తీరుస్తూ ఫలవంతమైన పరిశోధనలు చేసింది. ఉద్యాన పంటలపై పనిచేయడానికి హార్టికల్చర్ కీటకశాస్త్ర విభాగం, తెగుళ్ల విభాగాలు ఈ కేంద్రంలో ఉన్నాయి. ఉద్యాన కళాశాల స్థాపించిన తర్వాత ఉద్యాన పరిశోధన కేంద్రం, ఉద్యాన కళాశాలలో 2010 డిసెంబరులో విలీనం అయింది.

నిరంతర పరిశోధనలు

2012 నుంచి కూరగాయలు, పూలు, వార్షిక పంటలైన బొప్పాయి, అరటిపై పరిశోధనే ప్రధాన ఆదేశంతో పనిచేయడం ప్రారంభించారు. ఉద్యాన పరిశోధన కేంద్రం ద్వారా నీలీషాన్, నీలుద్దీన్, నీల్‌గోవా, స్వర్ణజహంగీర్, ఏయూ రుమాణి, కేఎంహెచ్-1 మామిడి రకాలను విడుదల చేశారు. కోడూరు-గోవా జహంగీర్, ఖాదర్-జహంగీర్, పంచదారకలస-విల్లార్డ్, పదిరి-అలంపూర్‌బనేషాన్, మల్లుబా-జహంగీర్, అంబలది-అలంపూరిబేనీషాన్, సువర్ణరేఖ-పదిరి అనే రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. త్వరలో వీటిని విడుదల చేయడానికి శాస్త్రవేత్తలు పరిశోధలు ముమ్మరం చేస్తున్నారు. మామిడికాయల రంగు, రుచి, వాసన, నాణ్యతలను పరిశీలిస్తున్నారు. ఇంకా చాలా కొంగొత్త వంగడాలపై పరిశోధనలు నిరంతరాయంగా చేస్తున్నారు. పరిశోధన కేంద్రం ద్వారా పదేళ్లుగా పులుసు నిమ్మ, బాలాజీ నిమ్మ, పీకేఎం-1 మొక్కలను రైతులకు అందిస్తున్నారు. అలాగే టిష్యూకల్చర్ ద్వారా నాణ్యమైన అరటి. పచ్చ అరటి, గ్రాండ్-9 మొక్కలను రైతులకు అందిస్తున్నారు.

తెగుళ్లు ఉండవు

ఇక్కడ అందించే పండ్ల మొక్కలకు ఎటువంటి వ్యాధులు, తెగుళ్లు ఉండవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మొక్కలను తీసుకుని సాగుచేస్తున్న రైతులకు మంచి సూచనలు, సలహాలు తీసుకుని దిగుబడులు చేస్తున్నారు. అదే కాకుండా ఎప్పుడూ వినిపించని, చూడని మామిడి రకాలను ఉద్యాన పరిశోధన స్థానం, ఉద్యాన కళాశాల వారు ప్రదర్శన చేస్తున్నారు. పరిశోధనలు విస్తరించడం, శాస్త్రవేత్తలు, సిబ్బంది పెరగడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో కోట్లాది రూపాయల వ్యవయంతో పెద్ద భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ పరిశోధనలు చేస్తున్నారు. ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

ఏటా కాపునిచ్చే మామిడిని అందిస్తాం



ప్రతి ఏటా కాపునిచ్చే మామిడిని రైతులకు అందిస్తాం. కాయ నాణ్యత, రంగు, రుచి, వాసనతో పాటు మంచి దిగుబడి వచ్చే రకాలపై పరిశోధనలు చేస్తున్నాము. గతంలో కొన్ని రకాలను మాత్రమే విడుదల చేశారు. కొత్త వంగడాలను ఎంచుకుని ఇతర ప్రాంతాల నుంచి కొమ్మలను తీసుకుని వచ్చి వాటిని సంపర్కం చేసిన తర్వాత వాటి పై పరిశోధనలు చేస్తున్నాము. త్వరలో కొన్ని మామిడి రకాలను విడుదల చేస్తాం.

- ఎం.శివప్రసాద్, ఉద్యాన కళాశాల ప్రధాన మామిడి శాస్త్రవేత్త

పరిశోధనలు వేగవంతం చేస్తున్నాం



పరిశోధనలు వేగవంతం చేస్తున్నాము. కావాల్సినంత వనరులు ఉన్నాయి. మంచి నాణ్యత ప్రమాణాలు కల్గిన మొక్కలను రైతులకు అందిస్తున్నాము. ఉద్యాన పరిశోధన కేంద్రం మొత్తం 300 ఎకరాల్లో విస్తీర్ణంలో ఉంది. దీనికి సాగు నీరు అందించడానికి తగిన సామర్థ్యం ఉంది. పరిశోధనలకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయి. రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు ఇస్తున్నాము.

- కేఎం యువరాజు, ప్రధానశాస్త్ర వేత్త, అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం

ఇవీ మామిడి రకాలు





పరిశోధన కేంద్రంలో కొత్తపల్లె కొబ్బరి, పానకాలు, చిన్నరసం, పెద్దరసం, చెరుకురసం, పంచదారకలస, బెంగుళూర, జహంగీర్, బేనీషాన్, హిమాంపసందు, పెద్దనీలం, వికారాబాద్, పాపారావుగోవా, విల్లార్డ్, కాలేపాడు, మనోరంజన్, దశేరి, కోడూరు గోవా, పెద్దఖాదర్, కేసర్, సఫేదా, నీలం, పండూరి మామిడి, చిన్నసువర్ణరేఖ, సువర్ణరేఖ, పులిహోరా, పునాస, అల్ఫాన్సో, హైదర్, ప్రొద్దుటూరు అవకాయ, మహమూద్ వికారాబాద్, అచార్‌పసంద్, యలమంద, అలీపసంద్, గద్దె మామిడి, అమ్రపాలి, అంబలవి-అలంపూర్ బనేషన్, మల్గూవ-జహంగీర్, మంజీరా, మల్లిక, పదిరి-అలంపూర్‌బనేషన్, పంచాదారకలస-విల్లార్డ్, రత్న, ప్రభాశంకర్, ఖాదర్-జహంగీర్, అలంపూర్-బనేషన్-మల్గూవ, సువర్ణరేఖ-పదిరి, కోడూరు గోవా- జహంగీర్ అనే మామిడి రకాలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిపై పరిశోధనలు సాగుతున్నాయి. ఇక్కడ పండే మామిడి కాయలు రుచి, రంగు, వాసన, నాణ్యత కల్గి ఉంటాయి. పరిశోధనలు పూర్తి చేసిన తర్వాత వాటిని రైతులకు అందిస్తారు.









అదాని ఎనర్జీకి మరో 42 ఎకరాలు

కలికిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కొండాపురం మండలంలో అదాని గ్రీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో వేయి మెగావాట్ల సామర్థ్యంతో నెలకొల్పనున్న పంప్‌డ్ హైడ్రో స్టోరేజీ పవర్ ప్రాజెక్టుకు మరో 41.99 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొండాపురం మండలం కె.బొమ్మేపల్లె గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 309/2, 310లలో 41.99 ఎకరాలను అదనంగా కేటాయించారు. న్యూ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ మార్గదర్శకంలో ఇక్కడ అదాని గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. గతంలో ఇదే గ్రామంలో 191.64 ఎకరాలు కేటాయించారు. ఈ భూములకు ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు వంతను అదాని గ్రీన్ ఎనర్జీ ప్రభుత్వానికి కౌలు చెల్లించాల్సి వుంది. తాజాగా ప్రస్తుతం కేటాయించిన 41.99 ఎకరాలను ఎకరా రూ.ఐదు లక్షల వంతున ధర నిర్ణయించింది. మొత్తం రూ.2,09,90,00లు మతింపుతో ఈ కేటాయింపులు జరుగనన్నాయి. దీనికి సంబంధించి అమల్లో ఇతర నిబంధనలను పాటించాలని సూచిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే బస్సుకు రూ.10 వేలు జరిమానా

మదనపల్లెఅర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా సంబంధించిన ఎస్‌ఎల్‌టీ సర్వీసు బస్సుకు ఆర్టీవో ప్రతాప్ శుక్రవారం రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆర్టీవో ప్రతాప్ మాట్లాడుతూ మదనపల్లె నుంచి బెంగళూరుకు ప్రతి రోజు ఉదయం మదనపల్లె బెంగళూరు బస్టాండ్‌లో 8.45కు బయలుదేరుతోంది. కానీ శుక్రవారం 7.45కు బయలుదేరింది. దీంతో మరొక బస్సు కన్నా ఒక గంట ముందుగా బయలుదేరడంతో వివాదం జరిగిందన్నారు. సమాచారం తెలుసుకున్న ఆర్టీవో ప్రతాప్ తమ సహచరులు ఎంవీఐలు దినేష్‌చంద్ర, శివలింగయ్యలతో కలిసి బెంగళూరు రోడ్డులో బస్సు ఆపి సమయం, తదితర వివరాలను చెక్ చేశారు. పర్మిట్ కన్నా గంట సమయం ముందు వెళుతుండడంతో ఆ బస్సుకు పది వేలు జరిమానా విధించారు.

మదరసా నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదు

మదనపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినికొండ పంచాయతీ-1 జన్మభూమికాలనీలో మదరసా నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జన్మభూమి కాలనీలోని బసినికొండకు దిగువవైపున 2000 సంవత్సరంలో ఉర్దూస్కూల్ మంజూరైంది. అప్పటి నుంచీ ఇప్పటి వరకూ అక్కడ పాఠశాల నడుస్తోంది. ఇక్కడి పాఠశాలలో బసినికొండ, రింగురోడ్డు, జన్మభూమి కాలనీ, నక్కలకుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల ఆవరణలో అదనపు గదులు కూడా నిర్మించారు. తాజాగా స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో మదరసా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా భూమి చదును చేస్తున్నారు. విషయం


ఉర్దూస్కూల్ ఆవరణలో మదరసా ఏర్పాటుకు చదును చేసిన స్థలం

తెలుసుకున్న స్థానికులు మదరసా ఏర్పాటును వ్యతిరేకిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ అంగన్‌వాడీ భవనం నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉన్నా..ఆలస్యం అవుతోందని, అయితే ప్రభుత్వం ఎప్పుడో నిషేధించిన మదరసాను ఏర్పాటు చేయడం ఏంటని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు ఆపేయాలని కోరుతూ తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు.

చౌకధర దుకాణాలకు సకాలంలో సరుకులు అందించాలి

- జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం


పౌరసరఫరాల గోదామును తనిఖీ చేస్తున్న డీఎస్‌వో రఘురాం

లక్కిరెడ్డిపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): చౌకధర దుకాణాలకు సకాలంలో సరుకులు అందించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పౌరసఫరాల గోదామును రఘురాం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాలకు సకాలంలో నాణ్యమైన సరుకులను పంపిణీ చేయాలని గోదాము ఇన్‌చార్జి మల్లికార్జునబాబును ఆదేశించారు. గోదాములో నిలువ చేసిన నిత్యవసర వస్తువుల తయారీ తేదీ, సరుకుల ముగింపు తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గోదాము దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోదాము ఇన్‌చార్జి మల్లికార్జునబాబు, డీటీ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రామాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లెలో ఇంటి స్థల విషయం గురించి తనకు న్యాయం జరగలేదని అవమానంతో పురుగుల మందు తాగి నందలూరు బసిరెడ్డి (70) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి వివరాల మేరకు... నందలూరు బసిరెడ్డి ఇంటి ముందు అదే గ్రామానికి చెందిన దేరంగుల వెంకటమణ అనే వ్యక్తి బసిరెడ్డి ఇంటి ముందు చిల్లర అంగడి పెట్టుకుంటానని విన్నవించాడు. కొంత కాలానికి బసిరెడ్డికి, వెంకట్రమణకు మధ్య విభేదాలు తలెత్తడంతో అంగడిని ఖాళీ చేయమని బసిరెడ్డి వెంకట్రమణకు తెలిపారు. అయితే వారు ఎంత చెప్పినా ఖాళీ చేయకపోవడంతో బసిరెడ్డి పురుగుల మందు తాగినట్లు ఆయన కుమారుడు రామాంజనేయులురెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

రాజంపేటటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ శివారులో ఆటో - బైకు ఢీకొన్న సంఘటనలో వెంకటరమణకు తీవ్రగాయాలయ్యాయి. ఓబులవారిపల్లె మండలం నూకనపల్లెకు చెందిన వెంకటరమణ రాజంపేటకు వస్తుండగా ఆటో వేగంగా వచ్చి బైకును ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటరమణ కాలికి తీవ్ర గాయాలు కాగా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గృహ నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలి

రైల్వేకోడూరు రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ అనుమతుల ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కుడా ఏపీఓ-2 క్రిష్ణ సింగ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎల్‌టీపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఉపచైర్మన్ ఆదితిసింగ్ ఆదేశాల మేరకు మండలంలోని రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణ అనుమతులను తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేసుకుని పనులు ప్రారంభించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జీఓలపై అధికారులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న కుడా ఏపీవో క్రిష్ణసింగ్

కల్పించారు. అనుమతులు ఉంటేనే నూతనంగా లేవుట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలతో పాటు భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. 300 చదరపు మీటర్లు ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ కార్యదర్శి ద్వారా అనుమతి తీసుకోవాలన్నారు. కమర్షియన్ నిర్మాణం కోసం తప్పనిసరిగా కుడా అనుమతులు ఉండాలన్నారు. కేవలం ఒక రూపాయితో 50 చదరపు మీటర్లలో ఇంటి నిర్మాణం చేసుకోవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో జేపీవో ఇందు, ఎంపీడీవో నాగార్జున రావు, ప్లానింగ్ కార్యదర్శి ఎస్.మణయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఉత్కంఠ నడుమ సర్పంచ్ ఓట్ల రీ కౌంటింగ్

- అడ్వకేట్ కమిషనర్ సమక్షంలో నిర్వహణ

వాల్మీకిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీకి సంబంధించి 2021లో జరిగిన ఎన్నికల నాటి ఓట్లకు రీకౌంటింగ్ ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఎన్నికల కౌంటింగ్‌లో అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ సర్పంచ్ అభ్యర్థి శ్రీనాథరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ అనంతరం శుక్రవారం వాల్మీకిపురం మండల పరిషత్ కార్యాలయంలో అడ్వకేట్ కమిషనర్ ఆనందకుమార్ సమక్షంలో రీ కౌంటింగ్ నిర్వహించారు. వివరాలను హైకోర్టుకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక సీఐ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్‌ఐలు, 40 మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో మస్తాన్, డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో మనోహర్‌రాజు,


2021 నాటి ఓట్లను రీ కౌంటింగ్ చేస్తున్న అధికారులు

డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవో రవీంద్రనాథ్, ఏపీవో సునీల్, న్యాయవాదులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

మంగంపేట కంకర క్వారీ పరిశీలన

ఓబులవారిపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపేట పరిధిలో ఉన్న కంకర క్వారీని శుక్రవారం జిల్లా మైన్స్ ఏడీ సుబ్రమణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందపల్లె గ్రామస్థులు మాట్లాడుతూ కాలుష్యం కారణంగా పంటలు నష్టపోతున్నామని, దుమ్ము ధూళితో శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని ఏడీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈశ్వర్ రాజు, శివప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో గొడవపడి ఓ మహిళ ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం, పాలసముద్రం, బోయపల్లెకు చెందిన డ్రైవర్ అశోక్(29)తో కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన మాలరాణి(29) మూడేళ్లుగా సహజీవనం చేస్తోంది. కొంతకాలంగా వారు బెంగుళూరులో ఉంటున్నారు. ఈ మధ్యనే అతను తమ స్వగ్రామానికి వెళ్లిపోయాడు. కాగా శుక్రవారం ఇద్దరూ మదనపల్లెలో కలుసుకున్నారు. ఆ సమయంలో అశోక్ కాలికి గాయం కావడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో అశోక్ ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆగ్రహించిన ఆమె ఆస్పత్రి నుంచి వెళ్లి బంకులో పెట్రోల్ కొనుక్కుని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కోమటివాని చెరువు కట్టకింద రోడ్డులో శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకుంది. ఆమెను వెతుకుతూ అక్కడికి చేరుకున్న అశోక్ మంటలు ఆర్పే ప్రయత్నంలో గాయపడ్డాడు.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆమెను ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో 274 మలేరియా కేసులు

- డీఎంవో రామచంద్రారెడ్డి


బాధితులకు కిట్‌లు అందజేస్తున్న డీఎంవో రామచంద్రారెడ్డి

పుల్లంపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 274 మలేరియా కేసులు ఉన్నాయని లక్కిరెడ్డిపల్లెలో 3 కేసులు ఉంటే రాజంపేట డివిజన్‌లో 271 కేసులు జిల్లా మలేరియా అధికారి టి.రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పుల్లంపేటలో ఇరువురు మలేరియా బాధితులకు ఎంఎండీపీ కిట్‌లను పంపిణీ చేసి వాడే విధానాన్ని అవగాహన కల్పించారు. అనంతరం పుల్లంపేటలోని వీధుల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లాలో 266 రెసిడెన్షియల్ వసతి గృహాలు ఉన్నాయని, దోమల నివారణకు యాంటి లార్వా స్ప్రే చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ చంద్ర, సీహెచ్‌వో రాజు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి కృష్ణమ్మ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుండంలో పడి అఘోరి మృతి

చిట్వేలి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నగిరిపాడు పంచాయతి పెద్దూరు అటవీ ప్రాంతంలోని గుండాలకోన గుండంలో పడి అఘోరి మృతిచెందింది. గత శివరాత్రి సందర్భంగా ఆమె గుండాలకోనను సందర్శించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అఘోరి గురువారం గుండాలకోనకు వచ్చి నిర్మానుష్యమైన ప్రాంతానికి వెళ్లిందని శుక్రవారం గుండంలో శవమై తేలిందని, ఈ విషయం స్థానిక పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అఘోరికి సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో శవాన్ని రైల్వేకోడూరు మార్చురిలో ఉంచినట్లు పోలీసులు తెలియజేశారు. అఘోరికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే సీఐ నెం.9121100576, ఎస్‌ఐ నెం.9121100579కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు

మదనపల్లెటౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. బి.కొత్తకోట మండలం సుబ్బిరెడ్డిగారిపల్లెలో జి.రవి నుంచి నాలుగు లీటర్లు, టి.ఆనంద్ నుంచి నాలుగు లీటర్లు, కె.వెంకటరమణ నుంచి 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. గ్రామంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి 370 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు జబీవుల్లా, డోర్కాస్, హెచ్‌సీలు మధుసూదన్, పీసీలు వెంకటేశ్, నాగరాజు, మధు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌లతో నీటిని నిల్వ చేసుకోవచ్చు



ఫారంపాండ్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

వల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఫారంపాండ్ ఏర్పాటు చేసుకుంటే నీటి నిల్వ ఉంటుందని.. పంటల సాగుకు రైతులు సద్వినియోగం చేసుకోవచ్చని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గోటూరు గ్రామంలో శుక్రవారం ఫారంపాండ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో మాట్లాడుతూ ఫారంపాండ్ ఉపాధి సిబ్బంది తెలిపిన కొలతల ప్రకారం ఈ ఫారంపాండ్‌ను రైతులు తవ్వుకోవాలని సూచించారు. ఐదుఎకర్యు ఖర్చులు కూడా ఉపాధి ద్వారానే అందిస్తామని తెలిపారు. అనంతరం ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఉపాధి కూలీలతో ఆయ న మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి ఉదయాన్నే ఉపాధి పని వద్దకు రావాలని సూచించారు. అనంతరం వారికి తగిన సలహాలు సూచనలు అందించారు. మండలంలో ఈ నెలాఖరుకల్లా 82 ఫారంపాండ్‌లు పూర్తి చేయాలని ఆదేశించారు. వీరివెంట ఏపీవో సుధారాణి, ఈసీ అంజలి, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా ఎద్దులకు మొదటి బహుమతి



బండలాగుతున్న ఎద్దులు

చాపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాలజిల్లా మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన కట్టుబడి రోలి మేడమ్ ఎద్దులు మొదటి బహుమతి రూ.70వేలు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లె గ్రామానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి రెండవ బహుమతి రూ.50వేలు, కడప పట్టణం రూకవారిపల్లె గ్రామానికి చెందిన ఓబులరెడ్డి ఎద్దులు మూడవ బహుమతి రూ.40వేలు గెలుచుకున్నట్లు తెలిపారు. జేసీకేఎల్ కమిటీ వైస్ ఛైర్మన్ ధ్వార్తల గురివిరెడ్డి, గ్రామస్తులు విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, గ్రామంలో రెండు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

చిన్నారి ఘటనను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు, మే 23 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం అయ్యవారి కంబాలదిన్నె గ్రామంలో శుక్రవారం మూడేళ్ల చిన్నారిపై జరిగిన దారుణ ఘటన క్షమించరానిదని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా.. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. ఈ ఘటన సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి కుటుంబానికి న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.50వేలు సాయం అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాకీ విషయంపై గొడవ...
యువకుడిపై మచ్చుకత్తితో దాడి



గాయపడిన శివరామకృష్ణారెడ్డి

కలసపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువరామాపురంలో బాకీ విషయంపై జరిగిన గొడవలో శివరామకృష్ణారెడ్డి (24) అనే యువ కుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన అంకిరెడ్డి అనే వ్యక్తికి శివరామకృష్ణారెడ్డికి మధ్య డబ్బుల విషయమై కొద్ది రోజుల నుంచి వివాదం జరుగుతోంది. గురువారం రాత్రి శివరామకృష్ణారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి అక్క డ ఉన్న తల్లి నారాయణమ్మ, ఇతర కుటుంబ సభ్యులను అంకిరెడ్డి దూషించి వెళ్లాడు. దీంతో ఆగ్రహానికి గురైన శివరామకృష్ణారెడ్డి తన తల్లితో కలిసి అంకిరెడ్డి ఇంటి వద్దకెళ్లి గొడవపడ్డాడు. ఒక్కసారిగా మచ్చుకత్తితో శివరామకృష్ణారెడ్డిపై అంకిరెడ్డి దాడి చేశాడు. తలకు తీవ్ర గాయం కావడంతో శివరామకృష్ణారెడ్డిని కడప రిమ్స్‌కు.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. విషయం తెలుసుకున్న కలసపాడు పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి



రాహుల్ మృతదేహం

చెన్నూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆమంచి రాహుల్ (18) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నూరుకు చెందిన రాహుల్ తన స్నేహితుడు రాజేశ్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో కడప వెళుతుండగా శేషయ్యగారిపల్లె సమీపంలో ముందు వెళుతున్న మినీ లారీని అదుపు తప్పి ఢీకొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. వీరిని కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాహుల్ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రైతు బజార్‌లను సద్వినియోగం చేసుకోవాలి

● వేంపల్లె రైతు బజార్‌పై కలెక్టర్‌తో చర్చిస్తా..సీఈఓ

● ఆంధ్రజ్యోతి కథనంపై సాగిన చర్చ



వేంపల్లెలో రైతు బజార్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న సీఈఓ మాధవీలత

వేంపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 125 రైతు బజార్లు ఉన్నాయని.. రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకువచ్చి రైతు బజార్‌లలో విక్రయించుకోవచ్చని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) మాధవీలత పేర్కొన్నారు. వేంపల్లెలో నూతనంగా నిర్మించి నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ రజనీ రుచిత, ఇతర అధికారులతో మాట్లాడారు. వేంపల్లెలో రైతు బజార్ నిరుపయోగంగా ఉండటానికి గల కారణాలపై సీఈవో ఆరాతీశారు. అనంతరంగా శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'రూ.1.20 కోట్ల ప్రజాధనం వృథా' కథనంపై చర్చించారు. రైతుబజార్‌ను వినియోగంలోకి తెచ్చేలా అధికారులు కొరవ చూపాలనే విషయంపై సీఈఓ మాట్లాడుతూ రైతుబజార్‌ను తెరిపించేందుకు కలెక్టర్, డీపీఓతో చర్చిస్తామన్నారు. త్వరలోనే ఉపయోగంలోకి తెచ్చేలా చూస్తామన్నారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ రైతులకు మేలు జరగాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం రైతు బజార్‌లను ఏర్పాటు చేస్తోందని, తమ ఉత్పత్తులను తెచ్చుకొని ఉచితంగా స్టాల్‌లో అమ్ముకోవచ్చన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ సీఈఓకు వినతిపత్రం సమర్పించారు. ఏడాదిగా మూతపడి ఉన్న రైతుబజార్‌ను తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

రూ.62 కోట్లతో బ్రిడ్జి పనులకు తిరిగి శంకుస్థాపన



బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లె గ్రామం వద్ద రూ.62 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు శుక్రవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తిరిగి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు తాను గండికోట ముంపు సమస్యలపై పాదయాత్ర చేశానని టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రిడ్జి పనులు చేపడతామని హామీ ఇచ్చానన్నారు. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే బ్రిడ్జి పనులను తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గండికోట బ్యాక్‌వాటర్ పూర్తిస్థాయిలో ఉన్నప్పుడు సంకేపల్లె చుట్టూ ఎనిమిది గ్రామాల ప్రజలు 50 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందన్నారు. ప్రజల ఇబ్బందిని గుర్తించి 2019వ సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వంలో అప్పడు మంత్రిగా ఉన్న తన బాబాయి ఆదినారాయణరెడ్డి చొరవతో రూ.34కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభించారన్నారు. బ్రిడ్జి పనుల్లో పిల్లర్లు వేసిన తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు జరగకుండా ఎంపీ, ఆపై ఎమ్మెల్యే అడ్డుకున్నారన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో తాను, తన బాబాయి పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.62 కోట్లతో తిరిగి పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, ఎంపీడీవో నాగప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు రామాంజులరెడ్డి, ఎంపీటీసీ రామమునిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నరసింహారెడ్డి, బాబురెడ్డి, గోవిందుజిబాలు, రాఘవేంద్రారెడ్డి, రమణారెడ్డి, మాధవరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కారులో అన్నింటా జిల్లాకు అన్యాయం

● మహానాడులో న్యాయం జరిగేలా తీర్మానం చేయాలి ● పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి) కూటమి సర్కారు ఏర్పడిన 11 నెలల పాలనలో జిల్లాకు అన్నింటా అన్యాయం జరిగిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో జిల్లాలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఉండేవారని, చంద్రబాబు పాలనలో జిల్లా నుంచి కనీసం ఒక్కరికి కూడా మంత్రి పదవి ఇవ్వకుండా జిల్లా అభివృద్ధికి అడ్డు పడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మూడు దఫాలుగా కొండవీటి చాంతాడంత నామినేటెడ్ పదవులు ప్రకటించారని, జిల్లాకు చెందిన ఒక్కరికి కూడా పదవి దక్కలేదన్నారు. అంతేకాకుండా టీటీడీ బోర్డులో కూడా జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. కడపలో జరగనున్న మహానాడు లోనైనా కొన్నింటికైనా పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇక పోతే గత ప్రభుత్వ హయాంలో పోతుల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ జీవో 85 జారీ చేసిందన్నారు. ఆ జీవోను కూటమి సర్కారు రద్దు చేయకపోగా యథాతథంగా అమలు చేస్తోందని విమర్శించారు. ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలిగేలా మహానాడులో నైనా జీవో 85ను రద్దు చేయాలన్నారు. విభజన చట్టం హామీల అమలులో భాగంగా జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం, బుం దేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా కడప- రాయచోటి, మదనపల్లి, బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం పనులు ఆగాయన్నారు. కడప-రేణిగుంట జాతీయ రహదారి పనులు మొదలు చేయడంలో కూటమి సర్కారు విఫలమయ్యిందని ఎద్దేవా చేశారు. తెలుగుగంగ, గాలేరు నగరి, వెలిగొండ పాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందని విమర్శించారు. జిల్లా అభివృద్ధికి ఏమి చేయ దలచారో మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అఫ్జల్‌ఖాన్, ఆశోక్ కుమార్‌రెడ్డి, సిరాజుద్దీన్, భువనేశ్వర్‌రెడ్డి, రవిశేఖర్, సంఘ సేవకులు సలా ఉద్దీన్, మామిళ్ల బాబు, ఎస్‌ఏ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌లో అదుపు తప్పిన బస్సు..



గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద అదుపు తప్పిన బస్సు

చింతకొమ్మదిన్నె, మే 23 (ఆంధ్రజ్యోతి): గువ్వలచెరువు ఘాట్‌లో ఓ ప్రైవేటుట్రావెల్స్‌కు చెందిన బస్సు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. రాయచోటివైపు నుంచి కడపకు వస్తున్న బస్సు గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద గురువారం రాత్రి అదుపు తప్పి మట్టికుప్పపైకి ఎక్కి ఆగిపోయింది. దీంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగలేదు. కాగా, బస్సు తిరుపతిలో అపహరణకు గురైనట్లు, చోరీకి గురైన బస్సు గురువారం రాత్రి గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద ప్రమాదానికి గురై ఆగిపోవడంతో నిందితుడు బస్సు అద్దాలు పగులగొట్టుకుని పారిపోయినట్లు తెలిసింది. ఘటనపై చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బండ్లకు ఇక చెల్లు

● డీలర్ల వద్దనే రేషన్ పంపిణీ

● వచ్చే నెల నుంచి అమలుకు చర్యలు



ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పులివెందుల టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ నిత్యావసర వస్తువులు పంపిణీ అంటూ గత వైసీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఎండీయూ వాహనాలు అందుబాటులో తెచ్చింది. కార్డుదారులకు ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో 2020 ఫిబ్రవరిలో ఈ వాహనాలు ఏర్పాటు చేశారు. అయితే ఆచరణలో మాత్రం పలుచోట్ల వీధుల్లో కూడా సరుకులు పంపిణీ చేయలేకపోయింది. ఎండీయూ ఆపరేటర్లుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలే ఉండటంతో వారు ఆడిందే ఆటగా పాడిందే పాటగా ప్రజా పంపిణీ వ్యవస్థ తయారైంది. డీలర్లకు పని లేకుండా చేయడంతో పాటు నిత్యం సర్వర్ సమస్యతో కార్డుదారులకు సక్రమంగా సరుకులు అందేవి కావు. దీనిపై పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గత రెండురోజుల క్రితం పౌర సరఫరాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టత కూడా ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న వాహనాలను కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు అప్పగించాలని ఆదేశించారు. ఈనెలాఖరులోగా రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జూన్ నుంచి రేషన్ డిపోల నుంచే సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. దీంతో జిల్లాలో ఉన్న 366 వాహనా లకు ఇక కాలం చెల్లింది.

జూన్ 1 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 1239 చౌకదుకాణాల ద్వారా 5,78,685 లక్షల మందికి కార్డుదారులకు సరుకులు అందించేలా ప్రణాళిక రూపొందిస్తుంది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నెలంతా రేషన్ దుకాణాలు పనిచేసేలా చర్యలు చేపట్టడంతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే సరుకులు అందించేలా చర్యలు చేపడుతుంది. ఇప్పటికే డిపోలు ఎక్కువున్నాయా చాలా మంది కార్డుదారులు తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి సూచించారు. దీంతో చౌకదుకాణాలను డీలర్లు శుభ్రం చేసే పనిలో పడ్డారు. స్థానిక ప్రజలను పిలిచి డిపోలను ప్రారంభించనున్నారు. దీంతో పాత విధానం అమలులోకి రానుంది. నేరుగా కార్డుదారులు డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి ఉంది. కానీ పట్టణ ప్రాంతంలో మాత్రం డిపోలు ఎక్కడున్నాయో తెలుసుకోవడం కష్టం. దీనిపై అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. అవినీతి అక్రమాలకు తావు లేకుండా నూతన యాప్‌తో పర్యవేక్షణ జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై ఆఫీసరు పేర్కొన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా నూతన యాప్‌తో పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు.

కూటమి పాలనలోనే
ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ నాగరాజు

కడప మారుతీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించడం జరిగిందని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సమావేశ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన సాకుతో దాదాపు 48వేల కుటుంబాల ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. చిన్న చిన్న కారణాలను సాకు గా చూపి ఉద్యోగులను (కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, ఇతర ఉద్యోగులు) సస్పెండ్‌మెంట్లు, సస్పెండ్లు, రిమూవ్ చేస్తూ వారిని తీవ్ర మనోవేదనకు గురయ్యేలా చేశారన్నారు. చాలామంది ఉద్యోగులు ఈ విషయం తన దృష్టికి తీసుకురావడంతో జీవీఎల్ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరామన్నారు. ఆ మేరకు వారు స్పందించి 2019 నాటి జీవోను తిరిగి ఈనెల 22న రాత్రి నుంచి అమలోకి తీసుకువచ్చారన్నారు. కాగా, చిత్తూరు, మంత్రాలయం రూట్లలో కేఎస్‌ఆర్‌టీసీలో ఏపీ సీనియర్ సిటిజన్లకు రాయితీ సౌకర్యం కల్పించాలని ఇటీవల కర్ణాటక రాష్ట్ర రవాణా శాఖ మంత్రిని కోరామన్నారు. సమావేశంలో ఆర్టీసీ కార్మిక పరిషత్ జోనల్ నాయకులు పురుషోత్తం పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో
బాలవికాస్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న బాలవికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ గంగయ్య

కడప ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్ష ఫలితాల్లో కడప నగరం ఎర్రముక్కపల్లె బాలవికాస్ విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ సంస్థ కరస్పాండెంట్ సుబ్బరాయుడు, కోఆర్డినేటర్ ధరణికుమార్, డైరెక్టర్ గంగయ్య తెలిపారు. మొత్తం 300 మార్కులకు గాను 250కి పైగా 8 మంది విద్యార్థులు సాధించారన్నారు. 200 మార్కులకు పైగా 41 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

పిచ్చికుక్క దాడి.. స్వీపరుకు గాయాలు

పులివెందుల టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండులో పిచ్చికుక్క దాడిలో ప్రశాంతి అనే స్వీపర్‌కు గాయాలయ్యాయి. శుక్రవారం ఆర్టీసీ ఆవరణలో శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా వెంబడించి దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈవిషయం ఆర్టీసీ అధికారులు మున్సిపల్ కమిషనరు రాముడు దృష్టికి తీసుకెళ్లడంతో పిచ్చికుక్కల నియంత్రణకు చర్యలు చేపడతామని తెలిపారు.

మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తదితరులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖమంత్రి జి.సంధ్యారాణికి కడపలో అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమ నిర్వహణ పనులు పరిశీలించేందుకు వచ్చిన ఆమెకు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సరస్వతి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాదు నుంచి విమానం ద్వారా కడపకు చేరుకున్న ఆమెకు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఐసీడీఎస్ అధికారులతో పరిచయ కార్యక్రమం చేపట్టారు.

ప్రతి పని వివరాలు రికార్డులో నమోదు చేయాలి

కమలాపురం రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ ద్వారా చేస్తున్న ప్రతి పనిని సిబ్బంది రికార్డులో నమోదు చేయాలని కార్యాలయ సీనియర్ అసిస్టెంటు విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఏపీడీ కార్యాలయ ఆవరణలో ఏపీడీ సోమశేఖర్ అధ్యక్షతన కమలాపురం క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీపథకం టెక్నికల్ అసిస్టెంట్లకు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమలాపురం, వల్లూరు, పెండ్లిమర్రి, వీఎన్‌పల్లె, చెన్నూరు, సీకేదిన్నె, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణీ



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఈశ్వరయ్య

లింగాల, మే 23 (ఆంధ్రజ్యోతి): జూన్ నెల నుంచి డీలర్ల ద్వారానే నిత్యావసరాల సరుకులను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు.లింగాల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంత వరకు ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసరాల సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత 60 సంవత్సరాలు దాటిన వారికి ఇంటివద్దనే సరుకులను అందించడం జరుగుతుందన్నారు.

చౌక ధర దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

సీకేదిన్నె, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ విధానంలో జూన్ 1 నుంచి చౌక ధరదుకాణాల ద్వారానే పంపిణీ చేయాలని తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం చౌక ధర దుకాణం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 1 నుంచి 15 వరకు రేషన్‌షాపుల వద్దనే సరుకులు పంపిణీ చేయాలని ప్రతి షాపులో ఈపాస్, వేయింగ్ మిషన్లు కండిషన్‌లో ఉంచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. రేషన్‌షాపు డీలర్లకు ఎదురయ్యే సమస్యలు సాంకేతిక సమస్యలపై తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆ బాయ్స్ హాస్టల్ గదులు కూల్చివేత సబబే'

కడప మారుతీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ ఎగ్జిక్యూటివ్ బోర్డు నిర్ణయం మేరకే సీఎస్ఐ బాయ్స్ హాస్టలు పాత గదులను కూల్చివేయడం జరిగిందని సంబంధిత డయాసిస్ వైస్ ఛైర్మన్ సాల్మన్, కార్యదర్శి సి.సాల్మన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆ హాస్టలు గదుల్లో హైస్కూలు నడుపుకునేందుకు తాము ఇతరులకు లీజుకు ఇవ్వలేదన్నారు. పైగా అగ్రిమెంటు కూడా చేసుకోలేదన్నారు. గతంలో తాము ఓ ప్రైవేటు ఇంగ్లీషు మీడియం స్కూలుకు లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. కాగా వారి లీజు కూడా పూర్తికావడంతో ఆ గదులు అప్పగించి వెళ్లడం జరిగిందన్నారు. ఆక్రమంలో తమకు తెలియకుండా ఓ మహిళతో సబ్‌లీజు ఒప్పందం కుదుర్చుకోవడం సరైందికాదన్నారు. ఈ విషయం తమకు తెలిసి బాయిస్ హాస్టల్ గదులు శిథిలావస్థకు చేరడంతో ఆ గదులు కూల్చివేశామన్నారు. అంతేతప్ప ఈ కూల్చివేతలో సంబంధిత డయాసిస్ పీఠాధిపతి, ఆయన కుమారుడి పాత్ర లేదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంటు సెక్రటరీ వినయ్‌కుమార్, రాయలసీమ డయాసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాటెమ్మతల్లి జాతర

పెండ్లిమర్రి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో వెలసిన పాటెమ్మతల్లి జాతర మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా అమ్మవారికి వేకువ జామునే ప్రత్యేక పూజలు,తీర్థ ప్రసాద వితరణ,కోలాటం,అన్నదాన కార్యక్రమం,సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండుగలా నిర్వహించారు.

ఆయకట్టు రోడ్డు అంటే అంత అలుసా..?

●ఎంతకాలం బురదలో రాకపోకలు ● ఏళ్లకొద్దీ ఇబ్బందులు పడుతున్న రైతులు

చెన్నూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆయకట్టు రోడ్లు రైతులకు ఎంతో ఉపయోగకరం. నిత్యం ఆ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. పంటల సాగు ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ఈ రోడ్డు రైతుకు మాత్రం జాతీయ రహదారితో సమానం. అలాంటి రోడ్లను చులకనగా చూస్తున్నారో ఏమో తెలియదు కానీ ఏళ్ల కొద్దీ అడుగుతున్నా సరిగా నిధులు అందించని పరిస్థితి. దీంతో వర్షాకాలం వచ్చిందంటే రైతులు పడే ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. కొన్నేళ్లుగా ఈ దార్లలో సిమెంటు రోడ్డు, తారురోడ్డు, వేయకపోయినా పర్లేదు. కనీసం కంకర రోడ్డు వేసి పుణ్యం కట్టుకోండి మహాప్రభూ అని మొత్తుకున్నా పలకని పరిస్థితి ఏర్పడింది. మండల వ్యాప్తంగా పలు చోట్ల ఈ ఆయకట్టు రోడ్లు వర్షాకాలం వచ్చిందంటే బురదగుంటలుగా, వర్షం తగ్గాక ఎగుడు దిగుడులుగా కనిపిస్తుంటాయి. కనీసం ఆ దారిలో ద్విచక్ర వాహనం పోయేది అటుంచితే నడకకు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాంటి రోడ్లు పరిశీలిస్తే చెన్నూరు పెద్దకాల్వ నుంచి (ఊరిలోకి వెళ్లే దారి) రామనపల్లె రోడ్డు దారుణంగా ఉంటుంది. అక్కడ నుంచి రామనపల్లె పాత గ్రామానికి వెళ్లే దారిది సైతం ఇదే పరిస్థితి. అక్కడ నుంచి ఓబులంపల్లె వెళ్లే దారి కూడా ఇదే పరిస్థితి. దాదాపు మూడు కి.మీ మేర ఈ దారి వర్షం కురిసిందంటే నడకకు మాత్రం ఘోరమే. అటుంచితే ఇదే పెద్దకాల్వ నుంచి అరుంధతీనగర్ వైపు వచ్చే దారి సైతం దారుణంగా ఉంటుంది. ఈ దారి బాగుపడితే చెన్నూరు ప్రధాన వీధిలో ఏదైనా వాహనాల రాకపోకల సమయంలో ఇబ్బంది కలిగితే ఈ దారే



చిన్నపాటి వర్షానికే బురదగుంటగా మారిన కేవోఆర్ కాలనీ - రామనపల్లె రోడ్డు

దిక్కు. అలాంటి దారిని వేయండి వేయండి అని కొన్నేళ్లుగా ప్రజలు వేడుకుంటున్నా పలికే దిక్కు లేరు. చెన్నూరుతో పాటు రామనపల్లె, ముండ్లపల్లె, ఓబులంపల్లె, కొండపేట, నరసా రెడ్డిపల్లె ఇలా ఒకటేమిటి ప్రతి ఊరిలో ఆయకట్టుదారుల పరిస్థితి అధ్వానమే.

పదేళ్లక్రితం ఎప్పుడో వేసింది..: పదేళ్ల క్రితం ఈ దారులు నాటి టీడీపీ హయాంలో కొంత వరకు గ్రావెల్ రోడ్డుగా వేశారు. అయితే వేసిన గ్రావెల్‌లో మట్టిశాతం ఎక్కువగా ఉండడంతో ఆ గ్రావెల్ రోడ్డు వేసినా ఫలితం లేకుండాపోయింది. చినుకు పడితే ఆ దారి అంతా అధ్వానంగా ఉంటుంది. చెన్నూరు ప్రధాన రోడ్డును ఇటీవల కాంక్రీటు వేయాలని సుమారు నెలకు పైగా రాకపోకలు బంద్ చేశారు. దీంతో ప్రజలంతా కొత్త రోడ్డు, అరుంధతీనగర్ మీదుగా ఈ పెద్దకాల్వ వరకు ఇదే దారిని ఆశ్రయిస్తూ వచ్చారు. వర్షం పడిందంటే ఆ దారి అంతా ద్విచక్రవాహనాలు రావాలన్నా జారిపడాల్సిందే.

అధ్వానంగా కేవోఆర్‌కాలనీ- రామనపల్లె రోడ్డు.. కేవోఆర్‌కాలనీ నుంచి రామనపల్లె వెళ్లే మరో దారి దాదాపు ముప్పావు కి.మీ ఉన్న ఈ దారి కొన్నేళ్లుగా చెన్నూరు నుంచి రామనపల్లె, రాచిన్నాయపల్లె మీదుగా కడప నగరానికి వెళ్లాలన్నా, ముండ్లపల్లెకు వెళ్లాలని గుర్రంపాడు వెళ్లాలన్నా అతి దగ్గర దారిగా ఉంటుంది. హైవే నుంచి తిరిగి వెళ్లే దానికన్నా ఈ కేవోఆర్ కాలనీ మీదుగా రామనపల్లె వెళ్లే దారి చాలా దగ్గరగా ఉండడంతో ప్రజలు ఎక్కువగా ఈ దారిలో వెళుతుంటారు. పైగా ఈ దారిలో వ్యవసాయ పొలాలు ఎక్కువ. వీటితో పాటు శేషయ్యగారిపల్లె దాటిన తరువాత ముండ్లపల్లె కాల్వ పక్కన ఉన్న ఆయ కట్టుదారి, రాచిన్నాయపల్లె వ్యవసాయ పొలాల్లో ఆయకట్టుదారి. కనుపర్తి నుంచి బలసింగాయపల్లె పొలాల వైపు వెళ్లే ఆయకట్టుదారి అలాగే కనుపర్తి నుంచి కొండపేట గ్రామంలోకి వెళ్లే కేసీ ఉపకాల్వల ఆయకట్టు దారి ఇంతే ఘోరంగా దర్శనమిస్తాయి. కేసీ ఆయకట్టు కింద పొలాలున్నా మండలంలో రైతులు ఎక్కువగా ఈ దారుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు.





చెన్నూరు పెద్దకాల్వ వద్ద దారుణంగా ఉన్న ఆయకట్టు రోడ్డు, బురదగుంటగా ఉన్న కేసీ ఉపకాల్వ రోడ్డు

రామనపల్లె రోడ్డుకు మోక్షమెప్పుడు..?



ఆయకట్టుదారుల్లో రామనపల్లెకు వెళ్లే ఈ దారిలోనే ఎక్కువ పొలాలున్నాయి. రైతులు ఎక్కువగా ఈ దారుల్లో తిరుగుతుంటారు. వందలాది మంది రైతులకు ఉపయోగపడే ఈ దారిపై అధికారులు దృష్టి పెట్టాలి.

-ఎ.రాజశేఖర్‌రెడ్డి, రైతు, ముండ్లపల్లె

కడప వాసికి డాక్టరేట్



వై.సుబ్బరాయుడు

కడప మారుతీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యరంగంలో సాంకేతిక ప్రగతికి దోహదం చేసే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీని అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం నుంచి కడప నగరంలోని మరాఠివీధికి చెందిన వై.సుబ్బరాయుడు విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. ది క్లస్టర్ విజువలైజ్ టాపిక్ మోడలింగ్ ప్యారడైమ్స్ ఫర్ రికగ్నిషన్ ఆఫ్ హెల్త్-రిలేటెడ్ టాపిక్స్ త్రూ మిషిన్ లెర్నింగ్ పరిశోధనలో సుబ్బరాయుడు కోవిడ్ -19 వంటి టాప్ 10 ప్రాణాంతక వ్యాధులపై మిషిన్ లెర్నింగ్ ఆధారిత పరిష్కారాల ద్వారా ముందస్తు హెచ్చరికలు ప్రజలకు అవగాహన కల్పించేందుకు వినూత్న విధానాలను కనుగొన్నారు. ఫిలాసఫీ కోర్సు మార్గదర్శకులు ప్రొఫెసర్ డాక్టర్ ఏ.సురేష్‌బాబు (డైరక్టర్ ఆఫ్ అడ్మిషన్స్- జెఎన్‌టియూ) మెంటర్‌గా వ్యవహరించారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శంకరాపురానికి చెందిన తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపికృష్ణ జన్మదినం సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఆవరణలోని ప్రేమాలయ,పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు శ్రీసాయి యువజన సేవా సంఘం ఛైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానకార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి వృద్ధులకు కేక్‌ను పంపిణీ చేశారు.

అన్నదాన కార్యక్రమానికి సహకరించిన తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపికృష్ణ సోదరుడు సూర్య డెవలపర్స్ అధినేత కంచి సురేంద్రనాథ్, వసతి గృహనిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి, శ్రీసాయి యువజన సేవా సంఘం సభ్యులు శివప్రసాద్‌రెడ్డి, పెయ్యాల అశోక్‌కుమార్, వల్ల బాష(బొమ్మన్), ప్రసాద్‌నాయుడు,ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు వినతిపత్రం అందజేత

కడప ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో గ్రేడ్-2 హెడ్మాస్టర్ పదోన్నతుల అడక్వసి వివరాలపై కడప జిల్లా విద్యాశాఖ అధికారికి ఏపీటీఎఫ్ అమరావతి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్,రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతులపై చర్చించడం జరిగిందన్నారు. దీనిపై జిల్లా శాఖ కార్యాలయం సిబ్బంది ఎస్టీకి అడక్వసి పూర్తయిందని, ఎస్సీకి నాలుగు పోస్టులు రిజర్వేషన్ ద్వారా భర్తీచేయడం జరుగుతుందని స్పష్టం తెలిపారని వారు వివరించారు. అడక్వసి వివరాలను కూడా బహిర్గతం చేస్తామని తెలిపారని వివరించారు.

మహానాడును విజయవంతం చేయండి

టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న శివకొండారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి నగర వాసులు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీనగర అధ్యక్షుడు సానుపురెడ్డి శివకొండారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మాచుపల్లె బస్టాండు నుంచి హబీబుల్లా స్ట్రీట్, బీకేయం స్ట్రీట్, మండీబజారులో ర్యాలీ నిర్వహించి గృహాలు, వాణిజ్య దుకాణాలకు వెళ్లి మహానాడుకు రావాలని ఆహ్వానించారు. జగన్‌పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, చంద్రబాబు సీఎం అయిన ఏడాదిలోనే ఆర్థికంగా రాష్ట్రం బలపడుతోందన్నారు. ఎన్నికలహామీలో భాగంగా ఇప్పటికే పింఛను రూ.4వేలు చేయడం, అన్నక్యాంటీన్, నిరుద్యోగులకు డీఎస్సీ, ఉచిత సిలిండర్లు అందిస్తున్నామన్నారు. వచ్చే నెల లోనే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య ప్రధాన కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమపై మహానాడులో

స్పష్టమైన వైఖరిని తెలియజేయాలి




ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం సమర్పిస్తున్న ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): విభజనచట్టప్రకారం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు నిర్లక్ష్యానికి గురవుతోందని, అదే విధంగా కడప - బెంగుళూరురైల్వే పనులు ముందుకు సాగక పోవడం దారుణమని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కడప నగరం ఎమ్మెల్యే నివాసలో కడప జిల్లాలో ప్రభుత్వ రంగంలో భారీ ఉక్కు పరిశ్రమ నిర్మాణం కడప-బెంగళూరు రైల్వే పనులు అమరావతి వరకు పొడిగించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సగిలి గుర్రప్ప, శ్రీనివాసులు, జయవర్ధన్, కృష్ణ, డబ్ల్యూ రాము, రసూల్, గోపి, నాగేంద్ర, జగదీష్, నాగరాజు,రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

వల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని కుమారునిపల్లె ఉన్న వరాల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. పాల్గొనే యజమానులు ఉదయాన్నే దేవస్థానం వద్దకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాలుంటాయని కార్యనిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి జ్యోతుల మహోత్సవం



కొత్తూరు చౌడేశ్వరి

సింహాద్రిపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజల సహకారంతో సింహాద్రిపురంలోని కొత్తూరు చౌడేశ్వరి ఆలయంలో శని, ఆది వారాల్లో జ్యోతుల మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తొగట వీర క్షత్రియ్య సంఘ సభ్యులు తెలిపారు. ఈ నెల 4వ తేదీన గ్రామంలో జరిపిన పెద్దమ్మ దేవత దేవర, చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల మహోత్సవం జరిగి 21 రోజులు కావడంతో శాంతి స్థాపన పూజల్లో భాగంగా జ్యోతుల మహోత్సవం శని, ఆది వారాల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

26న ఆశాల చలో కలెక్టరేట్

కడప మారుతీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగాజిల్లాలో పెండింగులో ఉన్న లెప్రసీ అలవెన్స్‌లను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న ఆశాలు తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నగర కార్యదర్శి శాంతమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ కార్యాలయంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని ఆశా వర్కర్లంతా చలో కలెక్టరేట్ విజయవంతం చేసేందుకు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆశావర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షురాలు నరసమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ పురోగతికి శ్రమించాలి



సుబ్బారావును అభినందిస్తున్న ఈడీ చంద్రశేఖర్

కడప మారుతీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పురోగతికి నూతన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ కమిటీ పునరంకితం కావాలని ఈడీ చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం స్థానిక రీజనల్ కార్యాలయ సముదాయ భవన్‌లో గల సభాభవనంలో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జోనల్ కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడుగా వినోద్ బాబు, కార్యదర్శిగా ఎం.చెన్నారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవీ రమణ, రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా ఇస్మాయిల్, వై.భద్రావతి, భాస్కర్, జోనల్ అసిస్టెంటు సెక్రటరీగా కోడూరు సుబ్బారావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్ఎంయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం తెరుచుకునేనా..?

వేంపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ స్ఫూర్తితో గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి, అక్కడ సేకరించే చెత్త ద్వారా సంపద సృష్టించాలి అనే నినాదంతో గతంలో టీడీపీ ప్రభుత్వం చెత్త సంపద తయారీ కేంద్రాలను గ్రామగ్రామానా నెలకొల్పింది. ఒక్కో చెత్త సంపద కేంద్రానికి లక్షలాది రూపాయలు వెచ్చించింది. వేంపల్లెలోని కాలేజీరోడ్డులో లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ వర్మీకంపోస్టు తయారీ, సేకరించిన వస్తువులను వేరుచేసి విక్రయించే కార్యక్రమం కొద్ది నెలలు సాగింది. వాహనాలు, ట్రైసైకిళ్ల ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి సంపద కేంద్రంలో వేసేవారు. అయితే 2019 ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక చెత్త సంపద కేంద్రాలు మూత వేశారు. ఐదేళ్లు ఆ కేంద్రాలు మూతలోనే ఉన్నాయి. మేజర్ పంచాయతీ అయిన వేంపల్లెలో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని మళ్లీ తెరిపించాలన్న యోచన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ చేయలేదు.

మూలన పడిన ట్రైసైకిళ్లు, వృథాగా మిషనరీ: వేంపల్లెలోని కాలేజీరోడ్డులో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేశారు. అక్కడ ఉపాధి హామీ నిధులు, ఇతర పథకం ద్వారా వెచ్చించి సుమారు రెండు ఎకరాల స్థలంలో షెడ్లు, వర్మీకంపోస్టు తొట్లు నిర్మించారు. గ్రామంలో దొరికే వస్తువులను వేరుచేసి విక్రయించేందుకు అవసరమైన కొత్త మిషనరీ కూడా అందుబాటులో ఉంది. గతంలో గ్రీన్ అంబాసిడర్లుగా సుమారు 30 మంది ఉండేవారు. గ్రామంలో చెత్తను సేకరించి అక్కడ వేసేవారు. స్థానిక మైనార్టీ నాయకులు తెలంగాణ వల్లి పర్యవేక్షణలో ఈ గ్రామంలో చెత్తాచెదారాన్నిసేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించేవారు. ప్రస్తుతం ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మళ్లీ తెరుచుకుంటుందని అందరూ భావించారు. ఏడాది అవుతున్నా ఏమాత్రం చర్యలు లేవు. అప్పట్లో తీసుకున్న ట్రైసెకిళ్లు తుప్పుపట్టి మూలన పడ్డాయి. ఇప్పటికైన అధికారులు చొరవ చూపి చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మూతపడి ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రం

త్వరలోనే తెరిపిస్తాం

వేంపల్లెలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని త్వరలో తెరిపించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈటలేని కారణంగా జాప్యం అవుతోంది. ఈట వచ్చిన వెంటనే కేంద్రాన్ని తెరిపించి చెత్తను సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుడతాం.

కుళాయమ్మ, ఎంపీడీఓ, వేంపల్లె.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

● డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యావసర సరుకులు అందించాలి ● నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : తహసీల్దార్ల సూచన



జమ్మలమడుగులో డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసరెడ్డి



పోరుమామిళ్లలో మాట్లాడుతున్న తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి

జమ్మలమడుగు, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటిస్తూ రేషన్ డీలర్లు ప్రజలకు సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని 37 మంది రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అందరికి రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్నారు. తక్కువ తూకాలు ఇచ్చి పేదల కడుపు కొడితే నిబంధనల మేరకు తప్పనిసరిగా కేసులు నమోదు చేయడంతోపాటు డీలర్‌షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కొందరు రేషన్ షాపుల వారు ఏదైనా పని ఉండి ఎక్కడికైనా వెళ్లినట్లయితే ముందుగానే సమాచారం ఇచ్చి రేషన్ సత్వరం లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. ప్రతినెల 15వ నుంచి 20వ తేదీ వరకు రేషన్ డీలర్లతో సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రేషన్‌డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్లు 15 రోజులు బియ్యం ఇవ్వాలి

చాపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌక దుకాణ డీలర్లు జూన్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిత్యావసర సరుకులు ప్రజలకు పంపిణీ చేయాలని తహసీల్దారు రమాకుమారి సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వాహనాల ద్వారా బియ్యం పంపిణీ నిలిపివేసి డీలర్ల ద్వారానే బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రికార్డులు భద్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీటీ కృష్ణారెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మల్లికార్జున, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: రేషన్‌కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా రేషన్ అందేలా చూడాలని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసల్దారు కార్యాలయంలో మండలంలోని 34 మంది రేషన్‌షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సక్రమంగా రేషన్ అందించాలని తూకాల్లో తేడాలు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 65 ఏళ్లు పైబడ్డ లబ్ధిదారుల జాబితా గుర్తించి వారికి రేషన్ వారి ఇంటి వద్దకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.



చాపాడులో మాట్లాడుతున్న తహసీల్దారు రమాకుమారి

విద్యుత్ శాఖ రెగ్యులర్ ఏఈగా రాజ్‌కుమార్

దువ్వూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండల విద్యుత్ శాఖ రెగ్యులర్ ఏఈగా రాజ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుమునుపు ఇక్కడ పనిచేస్తున్న వీరారెడ్డి రాజకీయ ఒత్తిడుల నేపథ్యంలో బదిలీపై వెళ్లారు. స్థానికంగా పనిచేస్తున్న సబ్‌ఇంజనీరు నరేంద్రారెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు కొద్దిరోజుల పాటు నిర్వహించారు. ప్రస్తుతం రెగ్యులర్ ఏఈ నియామకంతో వినియోగదారుల సమస్యలపై దృష్టి సారిస్తారనే ఆశాభావం పలువురు వ్యక్తపరుస్తున్నారు.

మున్సిపాలిటీలో అక్రమ బోర్డుల తొలగింపు



దుకాణాల వద్ద అక్రమ బోర్డులను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

బద్వేలు టౌన్,మే 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరురోడ్డులో అక్రమంగా వెలసిన పలు బోర్డులను మున్సిపల్ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పలుదుకాణాల వద్ద ఉన్న బోర్డులను తొలగించారు. ఈ మేరకు ఈ విషయమై ఆయా దుకాణ దారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మున్సిపల్ అధికారులకు , దుకాణ దారులకు మధ్య మాటల యుద్ధం జరిగింది. పెద్దలకోన్యాయం, పేదలకోన్యాయం అంటూ ఇలాంటి చర్యలు దుర్మార్గమని దుకాణదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రొద్దుటూరు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన తొగట వీర క్షత్రియ విద్యార్థులు ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని శ్రీ చౌడేశ్వరీదేవి తొగటవీర క్షత్రిసేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో చదివి 450కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పట్టణంలోని జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్‌లో 75 శాతంపైగా మార్కులు సాధించిన విద్యార్థులు, ట్రిపుల్ ఐటీలో, ఇంటర్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.4 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2,500 అందజేస్తామన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు 25వ తేదీలోపు తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో దరఖాస్తులు అందజేయాలని , జూన్ 1వ తేదీన ప్రముఖుల చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చౌడం వెంకటరమణ, ఉపాధ్యక్షుడు ఉమ్మడిశెట్టి చౌడయ్య, రామయ్య, చిన్నపుల్లయ్య, సూర్యనారాయణ, గోవిందు, తులసి ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు చూకూరి బాలయ్య, కోటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, మే 23 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో మూడేళ్ల చిన్నారిపై జరిగిన దారుణమైన ఘటనకు సంబంధించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు చూస్తే బాధ వేస్తుందన్నారు. చిన్నారి తల్లి ఆవేదనతో మాట్లాడిందన్నారు. తన కూతురిపై ఇలాంటి ఘటన జరుగడం బాధాకరంగా ఉందని, ఏమి చేస్తారో తమకు న్యాయం చేయాలని చిన్నారి తల్లి ఆవేదన వ్యక్తం చేసిందని అదే దిశగా ప్రభుత్వం అన్నివిధాలా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ సెక్రటరి గజ్జెల లక్షుమయ్య, దేవగుడి చంద్రశేఖర్‌రెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ఉప్పలపాడు యోబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముద్దనూరు మే23(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు టౌన్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు శనివారం ఉదయం రోడ్డు విస్తర్ణ పనుల్లో భాగంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు గుర్తించాలన్నారు.

సర్వే ఆకస్మిక తనిఖీ

జమ్మలమడుగు, మే 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ప్రత్యేక అవసరాలుగల పిల్లల సర్వేను శుక్రవారం జిల్లా సాహిత్య విద్య కోఆర్డినేటర్ రమణమూర్తి, సీఎంవో విశ్వనాథరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో ప్రత్యేక అవసరాలుగల పిల్లలను ఇంటింటి వద్దకు వెళ్లి పిల్లల తల్లిదండ్రులను సర్వే చేసి సూచనలు ఇవ్వడం జరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలలో భవిత కేంద్రంలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరడం జరిగిందని తెలిపారు. ఐఈఆర్‌పీ అర్చన, అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



కూటమి నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

బద్వేలు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల వద్ద రేషన్ పంపిణీ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం రేషన్ డీలర్లు ప్రజాప్రతినిధుల చిత్రపటాలకు తహశీల్దారు కార్యాలయం వద్ద క్షీరాభిషేకం చేశారు. ఈమేరకు రేషన్ డీలర్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి రేషన్‌పై ఆధారపడి జీవిస్తున్న తమకు కొంతకాలం నుంచి దానిని దూరం చేస్తున్నారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటనన్నింటిని పటాపంచాలు చేస్తూ తిరిగి డీలర్లకే ఆ బాధ్యతను అప్పగించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి డీలర్లపై నమ్మకముంచి మళ్లి డీలర్ల ద్వారా ప్రజలకు చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేయడంతో ప్రజలలో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా డీలర్లు తమ సంపూర్ణ మద్ధతు తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో రేషన్‌షాపు డీలర్ల సంఘం అధ్యక్షులు నారాయణ, సుబ్బరాయుడు, సూరజ్, బాస్కర్ రెడ్డి, పుల్లారెడ్డి, శివారెడ్డి, మాచుపల్లె లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై టెక్నికల్ అసిస్టెంట్ దాడియత్నం

ప్రొద్దుటూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులపై టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ బూతులు తిడుతూ శుక్రవారం రాత్రి దాడికి ప్రయత్నించారు. బాధితుడు శ్రీనివాసులు వివరాల మేరకు.. ఫీల్డ్‌అసిస్టెంట్ అయిన శ్రీనివాసులు తాళ్లమాపురంలోని కేసీ కాలువ పూడిక తీతవేత పనులకు, జంగిల్ రిమూవ్‌కోసం ప్రతిపాదనలు పెట్టమని చాలా రోజులుగా చెబుతూ వచ్చానని ఆ పనులు మంజూరు కాలేదని పేర్కొన్నారు. దీంతో ప్రభాకర్‌ను ప్రతిపాదనలు పంపకపోవడపై ప్రశ్నించానని ఈ నేపథ్యంలో శ్రీనివాసులు లింగాపురంలోని తన సొంత సూపర్ మార్కెట్‌లో ఉండగా టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ మద్యం తాగి ఒక స్నేహితుడుని తోడు తెచ్చుకుని దుకాణం వద్దకు చేరుకుని నానా బూతులు తిడుతూ దాడికి యత్నించారని పేర్కొన్నారు. అడ్డుచెప్పబోయిన తన భార్యను కూడా దుర్భాషలాడారని వివరించారు. ఈ తంతు అంతా తన దుకాణంలోని సీసీ కెమెరాలోకూడా రికార్డు అయ్యిందని చెప్పారు. ఈ విషయాన్ని ఉపాధి హామీ ఏపీవో మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేసేందుకు ఫోన్‌లో ప్రత్నించగా ఆయన అందుబాటులో లేరని జరిగిన విషయాన్ని ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డికి ఫోన్‌లో తెలుపగా తాను సెలవులో ఉన్నానని సోమవారం సమస్యపై విచారిస్తానని తెలిపారని బాధితుడు వివరించారు. ఈ విషయమై ఎంపీడీవో సూర్యనారాణరెడ్డి స్పందిస్తూ అసలు గొడవకు దారితీసిన పరిణామాలపై ఇరువురితో మాట్లాడి విచారిస్తానని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

ద్విచక్ర వాహన దొంగలు అరెస్ట్



ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మైదుకూరు రూరల్ ,మే 23(ఆంధ్రజ్యోతి) :ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను మైదుకూరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోట్లదుర్తి గ్రామానికి చెందిన కొప్పోలి జాయ్, ప్రొద్దుటూరు మండలం నంగనూరిపల్లెకు చెందిన చాపాటి పవన్ అనే ఇద్దరు యువకులు ఇళ్ల వద్ద ఉన్న మోటార్ సైకిళ్లను దొంగతనాలు చేసేవారన్నారు. వారి వద్ద నుంచి పది మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ సుమారు పది లక్షల రూపాయల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.మరో ముగ్గురు అనుమానితులను వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా..?



మడకలవారిపల్లె వద్ద కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

గోపవరం, మే 23 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని మడకలవారిపల్లె దళితవాడ వద్ద జాతీయ రహదారి 67 డివైడరు మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రమాదాలు జరిగితే కానీ పట్టించుకోరా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ హైవే రోడ్డులో ప్రమాదం జరగకముందే విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు కోరుకుంటున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు విజయవాడ నుంచి కడప మహానాడుకు వెళ్లాలంటే ఈ హైవేలో నుంచే వెళ్లాల్సి ఉంది.

గ్రామాల్లో చేనేతల జాబితా సేకరించండి

● కడప హ్యాండ్‌లూమ్ ఏడీ పిచ్చేశ్వరరావు



మాట్లాడుతున్న హ్యాండ్‌లూమ్ ఏడీ పిచ్చేశ్వరరావు

జమ్మలమడుగు, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, అందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు చేనేత కార్మికుల జాబితాను వెంటనే సేకరించాలని కడప హ్యాండ్‌లూమ్ ఏడీ పిచ్చేశ్వరరావు అధికారులకు సూచించారు. శుక్రవారం జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాలను హ్యాండ్‌లూమ్ ఏడీ సందర్శించారు. అందులో భాగంగా జమ్మలమడుగులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేతకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ చేనేతలకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్తు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వాటికి సంబంధించి జమ్మలమడుగు నియోజకవర్గంలో గ్రామాలవారీగా నేతన్నల డేటా త్వరగా సేకరించి రిపోర్టు పంపాలని డిజిటల్ అసిస్టెంట్లకు, సంబంధిత అధికారులకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడప కార్యకర్తల బలం నిరూపించాలి



మహానాడు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో టీడీపీ కార్యకర్తల బలమేమిటో నిరూపించేలా మే 27, 28, 29 తేదీలలో కడపలో జరిగే మహానాడుకు తరలిరావాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ బుక్కపట్నం జయశంకర్ ఆధ్వర్యంలో మహానాడుకు తరలిరావాలని వేసిన పోస్టర్లను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానాడు విజయవంతం కోసం జయశంకర్ రెండువేల పోస్టర్స్ స్టిక్కర్స్ వేయించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యకర్తలు పార్టీకి పునాదిలాంటి వారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు చేపట్టని ఇళ్లు రద్దు చేస్తాం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

బద్వేలు ,మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాజ్ యోజనలో భాగంగా ఇళ్లు మంజూరైనవారు వాటిని ఇంకా నిర్మించుకోనట్లయితే వాటిని తక్షణమే తొలగించి మరొకరికి మంజూరు చేయడం జరుగుతుందని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజారత్నం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పీఎంఎవై -1 కింద గృహాలు మంజూరు అయిన వారు ప్రభుత్వం అందించేసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకు వారికి మరొకసారి ఈ అంశంపై తెలియజేయాలని సూచించారు. అప్పటికీ ఆసక్తి చూపని వారి గృహాలను రద్దు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందనే విషయాన్ని వారికి వివరించాలని పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మన్సిపల్ కమిషనర్ వీవీ నరసింహారెడ్డి, హౌసింగ్ డీఈఈ ప్రతాప్, అసిస్టెంట్ ఇంజనీర్, అమెనిటీలు సిబ్బంది పాల్గొన్నారు.


వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు



స్వామిశివరామనంద సరస్వతిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

పోరుమామిళ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని మూలవీధిలో సీతా రామలక్ష్మణ సమేత ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గత మూడురోజులుగా మూలవీధిలోని ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు స్వామి శివరామనందసరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా శుక్రవారం జరిగిన ఈ ప్రతిష్ఠోత్సవంలో పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, వైసీపీ అదనపు సమన్వయ కర్త విశ్వనాధరెడ్డిలు పాల్గొన్నారు. అలాగే ఆ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు స్వామి శివ రామనందసరస్వతిని సన్మానించారు. ఇదిలా ఉండగా పోరుమామిళ్లలోని మూలవీధిలో పునః ప్రతిష్ఠగావిస్తున్న సీతారామలక్ష్మణ అంజనేయ సమేత దేవాలయ అభివృద్ధికి వైసీపీ అదనపు సమన్వయకర్త నల్లేరువిశ్వనాధరెడ్డి రూ.ఒకలక్షా వెయ్యినూట పదహార్లు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో తమ్మిశెట్టి రఘురామయ్య, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, లక్షణ్‌రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాతమ్మ ఆలయ ఉత్సవాలు



మాతమ్మతల్లి నూతన ఆలయం

బి.కోడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని శిరిగిరిపల్లె గ్రామంలో వెలసిన పురాతన మాతమ్మ ఆలయ నూతన ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, రక్షాబంధనం, మాతృకాపూజ కార్యక్రమాలు నిర్వహించారు. 24న శనివారం ప్రాతఃకాలపూజ, జపపారా యణం, ఆవాహిత దేవతాహోమాలు, నవగ్రహ, చండీ మూలమంత్రములు, గ్రామోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలి పారు. జరుగుతాయని, 25న ఆదివారం ప్రాతఃకాల పూజ, దీక్షాహోమం, హోమాలు, యంత్ర ప్రతిష్ఠ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠలతోపాటు బింబ కళాన్యాసం, బలి ప్రదానములు, పూర్ణాహుతి, కుంభాభిషేకం, సర్వదర్శనం ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. అలాగే మూడురోజులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు భక్తులకు అంది స్తామన్నారు. ఈ సందర్భంగా కోలాటం, కులుకు భజనలు ఏర్పాటు చేశారు.

సీతాలమ్మ తల్లికి బోనాలు.. ఎడ్ల పోటీలు



విజేత ఎడ్లకు నగదు బహుమతి అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఖాజీపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): అమ్మా! తల్లి ఈ ఏడాది అయినా చల్లంగా చూడు తల్లీ..! అంటూ గ్రామ మహిళలు సీతాలమ్మతల్లికి బోనాలు సమర్పించారు. మండల పరిధిలోని మిడుతూరు గ్రామానికి చెందిన సీతాలమ్మ తల్లి తిరునాళ్ల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడంతోపాటు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వృషభరాజములకు టీడీపీ నాయకులు సోముల త్రివిక్రంరెడ్డి, నెల్లూరప్పయాదవ్‌లు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండవ బహుమతి రూ.20వేలు, మూడవ బహుమతి రూ.15 వేలు, నాలుగవ బహుమతి రూ.10 వేలు అందజేశారు.

మాజీమంత్రి డీఎల్‌ను కలిసిన బీజేపీ నాయకులు

ఖాజీపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డిని తన స్వగృహంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోకల శ్రీకాంత్‌రెడ్డి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి మద్ధతు ఇవ్వడం మంచిదని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా డీఎల్ సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాగశివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లోకేష్‌యాదవ్, నాగార్జునరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.